ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 26 జనవరి 2024




విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు 8లో..

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం 8లో..

పెద్దపల్లి బీఆర్ఎస్ టికెట్ ఎవరికో..?

- కొప్పుల లేదా బాల్కకు అంటూ ప్రచారం
- తెరపైకి కొత్త పేర్లు రావడంతో ఎంపీ అలక
- టికెట్ ఇస్తామని కేటీఆర్ హామీ
- కేసీఆర్‌ను కలిసిన వెంకటేశ్ నేత



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో బీఆర్ఎస్ పార్టీ నుంచి బరిలోకి ఎవరిని దింపుతారనే అంశం చర్చనీయాంశంగా మారింది. గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 39స్థానాలకే పరిమితమై రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటాలని భావిస్తున్నది. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 9 స్థానాల్లో గెలుపొందిన బీఆర్ఎస్ ఈసారి జరగనున్న ఎన్నికల్లో ఆ స్థానాలనైనా కాపాడుకోవాలనే ఆలోచనతో ఉంది.

ఇప్పటికే బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరుసగా హైదరాబాద్‌లో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాలు నిర్వహించి పార్టీ యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను తప్పించాల్సినప్పటికీ, వారికే టికెట్ ఇవ్వడం వల్ల అధికారాన్ని బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పలువురు సిట్టింగ్ ఎంపీ అభ్యర్థులను మార్చాలనే యోచనలో ఉందని, అందులో పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేతకు బదులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ, ఎమ్మెల్యే బాల్క సుమన్‌లలో ఎవరికైనా టికెట్ ఇస్తారనే ప్రచారం బీఆర్ఎస్‌లో జోరుగా చర్చ జరుగుతున్నది.

ఎంపీ వెంకటేష్ నేతకాని ప్రజలకు అందుబాటులో లేరనే అపవాదును ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఈ కారణంగానే ఆయనకు టికెట్ ఇవ్వకుండా మరొకరికి ఇవ్వనున్నారనే ప్రచారం జరుగుతున్నది. అసలు బీఆర్ఎస్ పార్టీ ఎంపీల పట్ల పదేళ్ల నుంచి అను సరిస్తున్న విధానాల వల్లనే ఎంపీలు ప్రజలకు దూరంగా ఉండాల్సి వస్తున్నది. ఒకప్పుడు ఎంపీ అంటే ఆయన చుట్టూ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు తిరిగేవారు. ఎంపీకి అధిక ప్రాధాన్యాన్ని ఇచ్చేవారు. పార్టీల్లో కీలకంగా వ్యవహరించేవారు.

కానీ బీఆర్ఎస్ పార్టీ వారిని ఏమాత్రం పట్టించుకోలేదు. ఎంపీ కోటా కింద వచ్చే నిధులను నియో జకవర్గ అభివృద్ధి కోసం స్వేచ్ఛగా వెచ్చించే పరిస్థితి లేదు. నియోజక వర్గంలో పర్యటించాలంటే సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేలకు గానీ, ఎమ్మెల్యే లేకుంటే నియోజకవర్గ ఇన్‌చార్జీతో మాట్లాడిన తర్వాతనే అడుగుపెట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత వాళ్లు ఏదైనా కార్యక్ర మాలకు ఆహ్వానించినప్పుడు రావాల్సి వస్తున్నది. నేరుగా ప్రజలతో గానీ, పార్టీ నాయకులు, కార్యకర్తలతో గానీ సత్సంబంధాలు పెట్టుకునే సంప్రదాయం లేకపోవడం వల్లనే ఎంపీలకు పార్టీలో తగిన ప్రాధాన్యం లేకుండా పోయింది. 2014లో ఇక్కడి నుంచి ఎంపీగా గెలుపొందిన బాల్క సుమన్ సైతం పెద్దగా ప్రజలతో సంబంధాలు ఏర్పరచుకోలేకపోయారు. ఇందుకు కారణం ఎమ్మెల్యేలకు ఇచ్చిన ప్రాధాన్యం ఎంపీలకు ఇవ్వకపోవడమే. అందుకే ఆయన తన ఇమేజీని కాపాడుకునేందుకు ఎంపీకి గాకుండా ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు చెన్నూరు నియోజకవర్గాన్ని ఎంపిక చేసుకుని, తన పలుకుబడితో టికెట్ సాధించి గెలుపొందారు.

ప్రాధాన్యం కరువు..

ఎంపీల పట్ల పార్టీ అనుసరిస్తున్న విధానాల వల్లనే బీఆర్ఎస్ ఎంపీ లకు అంత ప్రాధాన్యం లేకుండా పోతున్నది. అందుకు పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేత అతీతుడేమీ కాదు. అయినా కూడా ఆయన నియోజకవర్గ అభివృద్ధి కోసం, నియోజకవర్గంలో ఉన్న పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నాయకులతో సమన్వయపరుచుకు ని పని చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చా లని, నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై రాష్ట్రం తరఫున పార్లమెంట్‌లో తన గళాన్ని వినిపించారు. పార్టీ ఆదే శాల మేరకు ఢిల్లీలో ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

వివిధ శాఖల మంత్రులను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడ్డారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై లిక్కర్ స్కాంలో మోపిన అభియోగాలపై కేంద్ర ప్రభుత్వంతో ఢిల్లీలో పోరాటం చేశారు. తనకు టికెట్ దక్కడం లేదనే ప్రచారంతో ఆయన కొంత మనోవేదనకు గురయ్యారు. 15 ఏళ్ల సర్వీస్ ఉన్న ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకుని ప్రజా సేవ కోసం వెంకటేష్ నేత రాజకీయాల్లోకి వచ్చారు. పార్టీకి విధేయుడిగా ఉంటూ పనిచేస్తున్న ఆయనకు పార్టీ టికెట్ రాదని, ఆయన పార్టీ మారుతున్నారని, బీజేపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారనే జరుగుతున్న ప్రచారం ఆయనను బాధించింది.

ఈ విషయం తెలుసు కున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వెంకటేష్ నేతతో మాట్లాడినట్లు సమాచారం. పార్టీ టికెట్ తనకే వస్తుందని, సీరియస్‌గా వర్క్ చేసుకోవాలని చెప్పారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అలాగే గురువారం వెంకటేష్ నేతకాని ఫామ్ హౌస్‌కు వెళ్లి బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలుసుకున్నారని సమాచారం. ఈ సందర్భంగా నియోజక వర్గ పరిస్థితుల గురించి, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలుస్తున్నది. ఎంపీ టికెట్ విషయమై వారి మధ్య చర్చకు వచ్చిందని, పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని గోహెడ్ అంటూ కేసీఆర్ భుజం తట్టి భరోసా ఇచ్చారని తెలిసింది. అయితే పార్టీ టికెట్ ఎవరికి ఇస్తారనేది వేచిచూడాల్సిందే.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



గణతంత్ర వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్ మైదానం

పెద్దపల్లి కల్చరల్, జనవరి 25 : గణతంత్ర దినోత్సవ వేడుకలకు కలెక్టరేట్ మైదానాన్ని ముస్తాబు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలకు జిల్లా అధికారుల ప్రశంసా పత్రాలకు, శకటాలప్రదర్శనలకు అనువుగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 8.59నిమిషాలకు కలెక్టర్ గౌరవ వందనం చేస్తారు. అలాగే తొమ్మిది గంటలకు కలెక్టరేట్ ఆవరణలో జాతీయపతాకాన్ని ఆవిష్కరణ చేసి ఉదయం 9.03 నిమిషాలకు పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తారు. ఉదయం 9.09 నిమిషాలకు కలెక్టర్ సందేశం అందించిన అనంతరం 9.26 నిమిషాలకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు జిల్లా అధికారులకు 9.35నిమిషాలకు ప్రశంసాపత్రాల పంపిణీ చేసి కార్యక్రమాలను ముగిస్తారు. సాయంత్రం ఐదు గంటల నుంచి 6 గంటల వరకు ఐడీఓసీ సెంటర్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ బూత్ లెవల్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జనవరి 25: హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ లెవల్ కన్వీనర్ల శిక్షణ శిబిరంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే ముఖ్యఅతిథిగా హాజరై బూత్‌లెవల్‌లో కార్యకర్తల పనివిధానాన్ని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాలని విధానాలపై కన్వీనర్లకు శిక్షణ ఇచ్చారు. బూత్ లెవల్ ఏజెంట్లు, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి, జనవరి 25: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు వెచ్చిం చి ప్రత్యేకంగా కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని కోనరావుపేటలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి 20లక్షల ప్ర భుత్వం నిధులతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. సర్పంచ్ కూసుకుంట్ల మంగ, జడ్పీటీసీ బొద్దుల లక్ష్మీనర్సయ్య, ఎంపీపీ రమాదేవి, విండో ఛైర్మన్ కొంజర్ల వెంక టయ్య, సర్పంచ్ నర్సింహయాదవ్, ఉపసర్పంచ్ మహేష్, నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

గుంట భూమి ఎండిపోకుండా పంటలకు సాగునీరు

ఓదెల, జనవరి 25 : నీటి కొరత ఎంత ఉన్నప్పటికీ నియోజకవర్గంలో గుంట భూమి ఎండిపోకుండా పంటల పూర్తివరకు సాగునీరు అందిస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. గురువారం మండలంలోని కొమిరలో రూ.70 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. అలాగే రూ.20లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కొమిర నుంచి అబ్బిడిపల్లి వరకు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సన్మానసభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మూల ఉమామహేశ్వరి, సాగర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సర్పంచ్ అంకం రమేష్, ఆళ్ల సుమన్‌రెడ్డి, అంబాల కొమురయ్య, పిట్టల రవీందర్, గుండేటి ఐలయ్య యాదవ్, బోడకుంట శంకర్, రెడ్డి రజనీకాంత్, మాజీ సర్పంచులు పుప్పాల శంకర్, పడాల రాజు, ఉపసర్పంచ్ లింగారెడ్డి, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో లాభదాయక సాగు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి రూరల్, జనవరి 25 : రైతులు ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ లాభదాయక సాగు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలోని రైతువేదిక వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయం, మల్లారెడ్డి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కృషి విజ్ఞాన కేంద్రం రైతు సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. బ్రాహ్మణపల్లి రైతువేదిక వద్ద ఏర్పాటుచేసిన ఆధునిక సాగు పద్ధతుల స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, బ్రాహ్మణపల్లి గ్రామంలో కూరగాయల సాగు బాగుందని, జిల్లాలోని రైతులకు ఇక్కడి రైతులు ఆదర్శవంతంగా నిలుస్తున్నారని తెలిపారు. ఆధునిక సాగు పద్ధతులను వినియోగించడం వల్ల పెట్టుబడి తగ్గి అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందని, నూతన సాగు విధానాలపై, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు వేదికలను వినియోగించుకుంటూ ఎప్పటికప్పుడు రైతులకు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఉన్న 3 లక్షల ఎకరాల వ్యవసాయ భూములలో అధికంగా వరి పంట సాగు చేస్తున్నామని, ప్రస్తుతం ఇతర దేశాలు సైతం వరి పంట సాగు చేస్తున్నాయని, మార్కెట్లో వరి డిమాండ్ తగ్గుతుందని, దీని కారణంగా భవిష్యత్తులో వరి ధర లభించడం కష్టమవుతుందన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. అంతకు ముందు గ్రామంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన్ కేంద్రం ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాన్ని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్ సైంటిస్ట్ , హెడ్ డాక్టర్ ఏ.శ్రీనివాస్, మల్లారెడ్డి కాలేజ్ అగ్రికల్చర్ డీన్ డాక్టర్ రాజారెడ్డి, ఏ.డి.ఏ శ్రీనాథ్, హెచ్.ఓ. జ్యోతి, సర్పంచ్ మల్లేశం, ఉప సర్పంచ్ ఓదెల రాజు, పంచాయతీ సెక్రటరీ కిరణ్, ఏవో అలివేణి, ఎఫ్.పి.ఓ. ప్రెసిడెంట్ వెంకటేశ్వర్ రావు, మల్లారెడ్డి, కె.వి.కె. సైంటిస్టులు, వెంకన్న, భాస్కర్, కిరణ్, వినోద్, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయండి

కళ్యాణ్‌నగర్, జనవరి 25: గోదావరి వంతెనపై తక్షణమే ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సుందిళ్ల బ్యారేజీ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు గోదావరి నిండుగా ఉండడంతో చాలామంది క్షణికావేశంలో గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నారని, ఇప్పటివరకు 300 మంది ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఈప్రాంత ప్రజలను కాపాడాలని పాలకవర్గానికి ఎన్నికసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, వంతెన చుట్టూ ఫెన్సింగ్ నిర్మిస్తే ఆత్మహత్యలు తగ్గుతాయన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ తీసుకుని రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ నగరపాలక సంస్థల సహకారంతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం..

అంతర్గాం, జనవరి 25: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు వ్యక్తిత్వ వికాసం ఏర్పడుతుందని పాలకుర్తి జడ్పీటీసీ కందుల సంధ్యారాణిపోచం అన్నారు. రామగుండం పట్టణంలోని జెన్‌కో గ్రౌండ్‌లో అర్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను గురువారం ప్రారంభించి మాట్లాడారు. అర్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బూడిద హర్షను, బీజేపీ నాయకులు కోమల్ల మల్లేష్, కొండపర్తి సంజీవ్, సుమంత్, బరుపటి నారాయణ, నవీన్, శ్రీకాంత్, పృథ్విరాజ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం..

- అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ



నూతన ఓటర్లకు కార్డులు అందజేస్తున్న అదనపు కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జనవరి 25: ప్రజాస్వామ్య దేశంలో ఓటు బలమైన ఆయుధం అని, దీనిని ఎన్నికల సందర్భంగా పారదర్శకంగా వినియోగించుకొని మంచి పరిపాలన అందించే వారిని ఎన్నుకోవాలని అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి అరుణశ్రీ పాల్గొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ఎన్నికల కమిషన్ సీఈవో అందించిన సందేశాన్ని ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా అందరితో ఓటుహక్కు వినియోగం సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. అరుణశ్రీ మాట్లాడుతూ భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన తర్వాత అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ భారత ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేసుకొని, ప్రతి అయిదు సంవత్సరాలకు ఎన్నికలు నిర్వహించుకుంటున్నామన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ జిల్లాలో ఉన్న సినియర్ సిటిజన్ లకు సన్మానం చేశారు. జిల్లాలో నూతనంగా ఓటు హక్కు పొందిన యువత ప్రతి ఎన్నికల్లోనూ ఓటు హక్కు సక్రమ మార్గంలో దేశ భవిష్యత్తు దృష్ట్యా ఉపయోగించాలని సూచిస్తూ ఓటరుగా నమోదు చేసుకున్నందుకు వారిని అదనపు కలెక్టర్ అభినందించి ఓటర్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో సి.హెచ్. మధుమోహన్, జిల్లా అధికారులు, ఎలక్షన్ డి.టి. ప్రవీణ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతర ప్రదేశాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

అంతర్గాం, జనవరి 25: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరి తీరంలో వచ్చే నెల 21 నుంచి 24వరకు జరుగనున్న శ్రీ సమ్మక్క-సాలరమ్మ జాతర ప్రదేశాన్ని గురువారం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ సందర్శించారు. ఈ సందర్భంగా భక్తుల స్నానఘట్టాలు, విడిది, పార్కింగ్, క్యూలైన్ ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని జాతర కమిటీ సభ్యులను, స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పీ రాంమోహన్‌రావు, బీ యాదగిరి, ఏఈ రాజ్‌కుమార్, సర్పంచ్ దర్ని రాజేష్, జాతర కమిటీ ప్రతినిధులు పెంద్రు హనుమాన్ రెడ్డి పాల్గొన్నారు.

మానవ తప్పిదాల వల్లనే రోడ్డు ప్రమాదాలు

- ఎన్టీపీసీ జీఎం ఠాకూర్

జ్యోతినగర్, జనవరి 25 : మానవ తప్పిదాల కారణంగానే అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రహదారి భద్రతా నియమాలు పాటించకపోవడంతో ప్రమాదాల సంఖ్య పెరుగుతున్నదని రామగుండం ఎన్టీపీసీ జీఎం ఎ.సి. ఠాకూర్ పేర్కొన్నారు. గురువారం ఎన్టీపీసీ ఈడీసీ ఆడిటోరియంలో రామగుండం ఎంవీఐ భీంసింగ్ ఆధ్వర్యంలో జరిగిన రోడ్డుభద్రతా మాసోత్సవాలలో జీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్ల నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అతివేగంతోపాటు ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం యాక్సిడెంట్లు పెరిగిపోయాయని, 2022లో 4లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. ప్రతి వాహన డ్రైవరు అప్రమత్తంగా ఉండాలని, ప్రధానంగా ప్రయాణికులను తీసుకువెళ్లే వాహన డ్రైవరు బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. కేవలం తాను పొరపాటు చేయడం వల్ల ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతారనే విషయాన్ని డ్రైవర్లు గ్రహించాలన్నారు. ఎంవీఐ భీంసింగ్ మాట్లాడుతూ రామగుండం ప్రాంత డ్రైవర్లకు రహదారి భద్రత విషయంలో చైతన్యవంతుల్ని చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి డ్రైవరు నిబంధనల ప్రకారం అన్ని రకాల అనుమతులు, ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు సేఫ్టీ బ్యాండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ సేఫ్టీ అధికారులు దూబే, నర్సింహారెడ్డి, డ్రైవర్లు పాల్గొన్నారు.

కోల్‌సిటీ, జనవరి 25: రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులకు గోదావరిఖని బస్టాండ్ వద్ద గురువారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గులాబీపూలను అందించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్ఐ ఉదయ్‌కిరణ్, హెడ్ కానిస్టేబుల్ ఓదెలు, కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జనవరి 25 : వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సుల్తానాబాద్ ఎస్ఐ విజేందర్ పేర్కొన్నారు. గురువారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సుల్తానాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లను ఉద్దేశించి వారికి రోడ్డు భద్రత గురించి ఏఎంవీఐ మధు, ఎస్ఐ విజేందర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్రైవర్లు, పోలీసులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎన్టీపీసీ జీఎం ఠాకూర్

ఎలిగేడు వాసికి పురస్కారం

ఎలిగేడు, జనవరి 25: మండల కేంద్రానికి చెందిన చెల్లోజ శ్రీనివాస్‌బాబు జాతీయ స్థాయి నంది అవార్డుకు ఎంపికయ్యాడు. యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆర్టిస్ట్ చెల్లోజ శ్రీనివాస్‌బాబు చిత్రకళ రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు గాను తెలుగు వెలుగు నుంచి జాతీయ పురస్కార నిర్వహణ కమిటీ చైర్మన్ బ్రహ్మశ్రీ డాక్టర్ వెలబోజు మోహన్‌రావు, కోఆర్డినేటర్ పోలోజు రాజ్‌కుమార్ చార్యులు జాతీయ పురస్కారం అందుకోనున్నట్లు చెల్లోజ తెలిపారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హుజూరాబాద్ జిల్లా సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

హుజూరాబాద్, జనవరి 25: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పీవీ పేరుతో హుజూరాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం జిల్లా జేఏసీ నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ నెల 28న హుజూరాబాద్‌లోని సిటీ సెంట్రల్ హాల్‌లో పీవీ జిల్లా కోసం జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు 13 మండలాలకు చెందిన అన్ని పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కవులు, కళాకారులు, మేధా వులు, అంబేద్కర్ వాదులు, యువకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సదానందం, వెంకట రాజం, రవీందర్‌రెడ్డి, రత్నం, ఈశ్వర్‌రెడ్డి, రాజన్న, శేఖర్, జగన్నాథం, ముక్కెర రాజు, హరిహరన్, అయిలయ్య, అశోక్, వంశీకృష్ణ, ప్రభాకర్, హరికృష్ణగౌడ్, లింగమూర్తి, మల్లయ్య, రాజు, శ్రీనివాస్, స్రవంతి, భానుచందర్, అశోక్, వెంకటరెడ్డి, ప్రభాకర్, సతీష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో నారాయణపూర్‌కు ఎల్లంపల్లి నీరు

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జనవరి 25: రెండు రోజుల్లో నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి నీరును పంపిణీ చేసి పంటలను కాపాడుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. నందిమేడారం పంపు హౌస్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంపు హౌస్ పనులు త్వరగా పూర్తి చేసి ఎల్లంపల్లి నీరు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ ఈఎన్‌సీతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ ఆయకట్టు చివరి మడి వరకు సాగునీరందిస్తామని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట చొప్పదండి మున్సిపాల్ చైరపర్సన్ గుర్రం నీరజ భూం రెడ్డి, గంగాధర జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్య, చొప్పదండి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బండపల్లి యాదగిరి, మునిగాల చందు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

రాయికల్, జనవరి 25: ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. రాయికల్ మండల లోని ఇటిక్యాల గ్రామానికి చెందిన అంకతి శ్రీనివాస్ (36) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై తన స్నేహితుడు దువ్వాక నాగరాజును కూర్చోబెట్టుకుని ఒడ్డెలింగాపూర్‌కు వెళ్లి వస్తుండగా భూపతిపూర్ గ్రామ శివారులో మూల మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన గల ఇనుప రెయిలింగ్‌కు ఢీకొట్టాడు. దీంతో శ్రీనివాస్ తలకు బలమైన గాయం కావడంతో ఆస్పత్రికి తరలించే క్రమంలో మరణించాడు. నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. శ్రీనివాస్ తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

గంగాదర: గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లికి చెందిన దాసరి మల్లయ్య(60), అదేగ్రామానికి చెందిన లింగయ్య గురువారం గంగాధరకు పనినిమిత్తం బైక్‌పై వెళ్లారు. సాయంత్రం ఇంటికి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా లక్ష్మీదేవిపల్లి శివారులో రోడ్డుపక్కన ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న మల్లయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న లింగయ్యకు కాళ్లు విరిగాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌లో ఖని ఎన్‌సీసీ కెడెట్లు


కెడెట్లు రిజియాన్, హైమ

కోల్‌సిటీటౌన్, జనవరి 25: ఢిల్లీలో శుక్రవారం జరిగే 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ కెడెట్లు రిజియాన్, బొజ్జ హైమ పాల్గొనేందుకు ఎంపి కయ్యారు. ఆర్మీ వింగ్ తరుపున రిజియాన్, హేర్ వింగ్ తరుపున బొజ్జ హైమలు తెలంగాణ, ఏపీ డైరెక్టరేట్ నుంచి పాల్గొం టున్నారు. కాగా దేశ ప్రధాని నరేంద్రమోదీకి గౌరవ వందనం చేయనున్నారు. కాగా పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు పాల్గొనడం జిల్లాకు, పాఠశాలకు ఎంతో గర్వకారణమని పాఠశాల కరస్పాండెం ట్ లవ్‌లీజాకబ్, ప్రిన్సిపల్ జ్యోత్న్స, ఎన్‌సీసీ ఆఫీసర్ జ్యోత్న్స, ప్రైమరీ ఇన్‌ఛార్జి ఇన్నమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆదివరహాస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గంగుల


కుటుంబీకులతో కలిసి మొక్కులు చెల్లించుకుంటున్న గంగుల

కమాన్‌పూర్, జనవరి 25: మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆదివరహా స్వామిని గురువారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, సర్పంచ్ నీలం సరిత,దేవస్థాన డైరెక్టర్ దండే కనకరత్నం, యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్‌గౌడ్ ఉన్నారు.

ఆయిల్ పామ్ తోటలను సందర్శించిన జగిత్యాల రైతులు

అశ్వారావుపేట, జనవరి 25: జగిత్యాలకు చెందిన సుమారు 150 మంది పామాయిల్ రైతులు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, దమ్మపేటలో మండలాలలో పలు పామాయిల్ క్షేత్రాలను సందర్శించారు. పామాయిల్ రైతులు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా పామాయిల్ నర్సరీల పెంపకం, క్షేత్రాలు, సాగు విధానం, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపై అవగాహనకోసం అశ్వారావుపేటలోని పామాయిల్ నర్సరీని సందర్శించారు. అనంతరం నారంవారిగూడెంలోని పామాయిల్ తోటలను రైతులు అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ అధికారులు చూపించారు. అనంతరం దమ్మపేట మండలంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీని చూపించి, ఉత్పత్తి అయిన పామాయిల్ గెలల క్రషింగ్ విధానంపై రైతులకు వివరించారు.

కొండగట్టులో ఆగని అదనపు వసూళ్లు

● ఇబ్బందులు పడుతున్న భక్తులు ● పట్టించుకోని ఆలయ అధికారులు

మల్యాల, జనవరి 25: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తులు దేవస్థానం పరిధిలో అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారు. కొండ ఎక్కింది మొదలు దిగే వరకు నిలువు దోపిడీ బారిన పడుతున్నారు. ఏళ్లుగా ఇదే తంతు సాగుతున్నా దేవాదాయ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని హిందూ ధార్మిక సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొండపైన గుట్కాల విక్రయం, అధిక ధరల దోపిడీతో భక్తుల మనోభావాల్ని దెబ్బతీస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొండగట్టు అంజన్న సన్నిధిలో కొబ్బరికాయ నుంచి అన్ని వస్తువులను కొనాలంటేనే భక్తులు జంకుతున్నారు. మార్కెట్ ధరలకు అదనంగా 10శాతం హెచ్చు ధరలతో కొండపైన వస్తువులు విక్రయించాలని పేర్కొంటున్నప్పటికీ ఇక్కడ అధిక ధరలకు అమ్ముతున్నారని కొందరు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొండపైన గల అన్ని దుకాణాల్లో దోపిడీ జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. లాకర్ రూం, కిరాణం, కూల్‌డ్రింక్స్ హోటల్, ఫొటోస్టూడియో, బొమ్మలు, పూలు, పండ్లు అమ్మకం వద్ద కూడా భక్తులు దోపిడీకి గురవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. చివరకు చెప్పులు భద్రపరచడం చోట, మరుగుదొడ్ల వద్ద కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. వాహన పూజలకు టికెట్టు తీసుకున్నప్పటికీ భక్తుల వద్ద వాహనాన్ని బట్టి అర్చకులు, అక్కడి సిబ్బంది వందల్లో వాహనాదారుల వద్ద వసూలు చేస్తారనేది బహిరంగ ముచ్చట.. కానీ పట్టించుకునే వారుండరు. తలనీలాలు సమర్పించే చోట క్షురకులు ఒక్కో భక్తుడి వద్ద రూ.50కి పైగా, కొబ్బరియకాయలు కొట్టే చోట రూ.5 నుంచి 10 వసూలు చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తారే తప్ప చర్యలు తీసుకోరని పలువురు ఆరోపిస్తున్నారు.

● కానరాని ధరల సూచిక బోర్డులు

ఆలయ పాలక మండలి ఏడాదిన్నర క్రితం దుకాణాల వద్ద ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. ఇంత వరకు వాటి ఊసే లేకుండా పోయింది. ప్రతి దుకాణం ముందు ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వాటిని నిత్యం పర్యవేక్షణ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇటీవల వీహెచ్‌పీ నాయకులు కొబ్బరికాయ కొట్టే వద్ద వసూళ్లు, అధిక ధరలకు వస్తువుల విక్రయంపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోవాలంటూ ఈవోకు వినతిపత్రం అందజేశారు. అయినా పట్టించుకునే వారు కరువయ్యారు. కొండపైన దుకాణాలు ఒక్కొక్కటి మాత్రమే ఉండడంతో వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ భక్తులను దోచుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న దుకాణాలను ఒక్కో దాన్ని రెండు నుంచి మూడుకు పెంచాల్సి ఉంది.


కొండగట్టు ఈవోకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

బోర్డులు ఏర్పాటు చేయాలి

యాగండ్ల లక్ష్మీనారాయణగౌడ్, వీహెచ్‌పీ అధ్యక్షుడు



కొండగట్టులో వ్యాపారుల దోపిడీ అరికట్టడానికి ఆయా దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి. ధరల సూచికలతో భక్తులు దోపిడీకి గురికాకుండా చూడవచ్చు. కొందరు అధికారుల నిర్లక్ష్యంతోనే వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే మేమే బోర్డులు ఏర్పాటు చేస్తాం.



చర్యలు తీసుకుంటాం - పి.వెంకటేశ్, ఈవో

కొండపైన వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే తగు చర్యలు తీసుకుంటాం. దేవస్థానం నిబంధనల మేరకే వస్తువులు విక్రయించాల్సి ఉంటుంది. వ్యాపారులు, అర్చకుల నుంచి భక్తులకు ఇబ్బంది కలిగితే ఫిర్యాదు చేయాలి. వ్యాపార సంస్థలు, దుకాణాల ముందు ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

అంబేద్కర్ డిగ్రీ ప్రవేశానికి ఈ నెల 31 వరకు గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, జనవరి 25: డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు గడువు ఈనెల 31 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.టి.లక్ష్మీ, కోఆర్డినేటర్ డా.ప్రశాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్, ఐటిఐ, డిప్లొమా విద్యార్థులు, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని రశీదు పొందాలని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం 73829297755 ఫోన్ నంబర్‌కి కాల్ చేసి సంప్రదించాలని కోరారు.

ఎస్‌యూలో ఈ నెలతో ముగియనున్న రిటైర్డ్ అధ్యాపకుల సేవలు

గణేష్‌నగర్, జనవరి 25: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు రిటైర్డ్ ప్రొఫెసర్ల సేవలు జనవరి 31తో ముగియనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సంకశాల మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీకి 12బి గుర్తింపులో న్యాక్ సాధించేందుకు కమిటీలో భాగస్వాములైన వివిధ విభాగాల రిటైర్డ్ అధ్యాపకులు భరత్, సాయిలు, పురుషోత్తం, వడ్నాల రమేష్, లక్ష్మణ్ సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెలతో సేవలు ముగియనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మానకొండూర్, జనవరి 25 : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఏనుగుల నాగరాజు (46) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. అన్నారం చెందిన నాగరాజు బుధవారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండగా హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గోదావరిలో రెండు మృతదేహాలు లభ్యం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోదావరి నదిలో గురువారం రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకునేందుకు నదిలో దూకగా మృతదేహాలు గురువారం తెల్లవారు జామున ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. ఈమృత దేహాలు గోదావరిఖనికి చెందిన అజీమొద్దీన్(29), కొయ్యడ రాకేష్(33)గా పోలీసులు గుర్తించారు. రెండు రోజుల క్రితం అనారోగ్యకారణాలతో అజీమొద్దీన్ నదిలో దూకాడు. దూకిన చోటే అజీమొద్దీన్ మృతదేహం తేలింది. శివాజీనగర్‌కు చెందిన రాకేష్ మానసిక స్థితి సరిగ్గాలేదని, ఈనెల 19న ఇంటి నుండి వెళ్లిన రాకేష్ ఇంటికి తిరిగి రాలేదు.

మైనింగ్ అండ్ జియాలజీ డైరెక్టర్‌ను కలసిన బ్రాహ్మణ సంఘం నేతలు

రామగిరి, జనవరి 25: రాష్ట్ర మైనింగ్ అండ్ జియాలజీ డైరెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సుశీల్‌కుమార్‌ను గురువారం ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర బ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ జనరల్ సెక్రటరీ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేదాంతం పవన్‌కుమార్, నాయకులు ఆదిత్య, నీలకంఠం కైలాష్‌లు పుష్పంగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


డైరెక్టర్‌ను అభినందిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

డివైడర్‌ను ఢీకొన్న బైక్ : ఇద్దరికీ గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండు ప్రాంతంలో గురువారం బైక్ డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో మండల కేంద్రానికి చెందిన బక్కి నితిన్, ఎర్నాల బన్నీ తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారిలో బన్ని పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25: పోతనకాలనీ సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో అడ్రియాల లాంగ్‌వాల్ కార్మికుడు బండ శశికుమార్(31) మృతి చెందాడు. మొదటి షిఫ్టుకు హాజరైన శశికుమార్ వ్యక్తిగత పనులు పూర్తి చేసుకుని సాయంత్రం సమయంలో ద్విచక్ర వాహనంపై గోదావరిఖని ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో లక్ష్మీపురం క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సిరిసిల్ల క్రైమ్, జనవరి 25: సిరిసిల్ల పట్టణంలోని రగుడు బైపాస్ రోడ్డు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెలగొండ అభిలాష్ (20) అనే యువకుడు గురువారం రాత్రి హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెద్దూరుకు చెందిన అభిలాష్ ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల బైపాస్ రోడ్డు నుంచి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన మహిళ నేరేళ్ల రాజవ్వ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని రాజవ్వ అనారోగ్యంతో పాటు గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదని పేర్కొన్నారు. ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదని చెప్పారు. బంధువులు, చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు.

రాజవ్వ కొడుకు జీవన్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

రాజన్న ఆలయ అభివృద్ధిపై త్వరలోనే సమీక్ష

● సర్పంచ్ ఎన్నికలపై త్వరలోనే నిర్ణయం ● రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

వేములవాడ, జనవరి 25 : రాష్ట్రంలోనే అతి పెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి జరగాల్సినంత జరగలేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో త్వరలోనే ఆలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం, మేడారం సమ్మక్క సారక్క జాతర వంటివి మన పూర్వీకులు మనకు వారసత్వంగా ఇచ్చినటువంటివని ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మన ఆలయాలు, సంస్కృతి దేశం మొత్తం తెలిసేలా విస్తృత ప్రచారం చేయడంతో పాటు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. రాజన్న ఆలయం అభివృద్ధిలో తాము కూడా భాగస్వామ్యం అవుతామని చెప్పారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీలకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదని, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన అంశంపై రెండు రోజుల్లో ప్రభుత్వ పరంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. స్టేట్ ఫైనాన్స్ నిధులు ఇతర పనులకు వెచ్చించడం వల్లే సర్పంచ్‌ల బిల్లులు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి తెలిపారు. నిధుల లభ్యత బట్టి సర్పంచుల పెండింగ్ బకాయిలను దశలవారీగా చెల్లించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి పైసా ప్రజా సంక్షేమం కోసమే వెచ్చిస్తున్నామని స్పష్టం చేశారు.

విధ్వంస రాజకీయాలకు పాల్పడుతున్న కేటీఆర్

మాజీ మంత్రి కేటీఆర్ అధికారంలో లేకుండా ఒక్కరోజు కూడా ఉండలేకపోతున్నారని, అందుకోసమే కేటీఆర్ విధ్వంస రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. గత పదేళ్లలో సామాజిక మాధ్యమాలలో ఉన్నది లేనట్టుగా చూపి కాలం గడిపారని, విదేశాలకు వెళ్లి నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకొని వచ్చి ఇదే భాషగా చూపి నటించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు వస్తున్న ప్రజా ఆదరణను చూసి ఓర్వలేక కేటీఆర్ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని అన్నారు. తప్పుడు మాటలను ప్రజలు ఇకపై ఎట్టి పరిస్థితులలోనూ నమ్మలేని పరిస్థితి వచ్చిందని, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్ ఇప్పటికీ ప్రమాణస్వీకారం చేయలేదని అన్నారు. కేటీఆర్ బుద్ధిగా ప్రతిపక్ష హోదాలో పనిచేస్తేనే ప్రజలు గుర్తిస్తారని లేదంటే ప్రజలు ఎప్పటికీ తిరస్కరిస్తూనే ఉంటారన్నారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని కోరుకున్నానని తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో తనది అన్న చెల్లెల్ల అనుబంధం అని, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో తను ప్రభుత్వ విప్‌గా, తాను మంత్రిగా సేవలు అందిస్తున్నామని సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా ఆమె వెంట ఉన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

రాజన్న సేవలో మంత్రి సీతక్క

వేములవాడ: రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సేవలో తరించారు. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు రాజన్నను దర్శించుకునే ఆనవాయితీలో భాగంగా గురువారం ఉదయం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు తొలుత ఆలయ అర్చకులు అధికారులు సంప్రదాయ బద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు మంత్రికి వేదోక్త ఆశీర్వచనం గావించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించగా, ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ శ్రీ స్వామివారి చిత్రపటం అందజేశారు. అంతకుముందు శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వచ్చిన మంత్రి సీతక్కను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఇతర అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు.

కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే ఊరుకోం

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో ఓ కేసులో అరెస్టు అయి ఉన్న బీఆర్ఎస్ నాయకుడు, హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిని కవిత పరామర్శించారు. అనంతరం జగిత్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగగానే బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ సర్కారు అక్రమంగా కేసులు నమోదు చేయిస్తూ కక్ష పూరిత రాజకీయాలను చేస్తోందన్నారు. హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డిని సంబంధం లేని కేసులో ఇరికించి అరెస్టు చేసి జైలుకు పంపడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి కక్షపూరిత వైఖరిని అవలంభిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలను పువ్వుల్లో పెట్టుకొని చూసుకున్నామని వివరించారు. ఏ పార్టీ కార్యకర్తలపై అయినా తాము రాజకీయంగా పోరాటం చేశామే తప్ప చట్టాన్ని, పోలీసులను వినియోగించుకొని కక్షపూరితంగా వ్యవహరించలేదన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పనిచేస్తూ హామీల అమలుకు ప్రయత్నం చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థినిలను మహిళా పోలీసులు జుట్టు పట్టి లాగి పడగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్, పలువురు న్యాయవాదులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


జగిత్యాలలో జైలులో బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శించి వస్తున్న కవిత

'తన భర్త చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: తమకు రావాల్సిన భూమిని పట్టా చేయించకుండా ఇబ్బందులకు గురి చేయడంతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగి వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తన భర్త మరణించాడని దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన బానోతు జ్యోతి గురువారం ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె కథనం మేరకు... గ్రామంలోని జ్యోతి ఆమె భర్త నాజం కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నాజం గ్రామ శివారులో 2.02 ఎకరాల భూమిని 12 ఏళ్ల కిందట కొనుగోలు చేశాడు. నాజం, గణేశ్‌లు అన్నదమ్ములు. కొనుగోలు చేసిన భూమిలో ఇద్దరు పంచుకోగా చేరో ఎకరం భూమి వచ్చింది. తన మరిది గణేశ్ పట్టా చేయిస్తానని నమ్మించి భూమి మొత్తం ఆయన పేరిట మార్చుకున్నట్లు తెలిపింది. మూడేళ్లుగా పేరుపై భూమి చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడని తెలిపింది. పలుమార్లు పంచాయతీ నిర్వహించిన పెద్దలు అర ఎకరం పట్టా చేయడంతో పాటు రైతు బంధు కింద వచ్చిన రూ.20 వేలు నాజంకు చెల్లించాలని చెప్పారని తెలిపారు. అందుకు అంగీకరించిన గణేశ్ పట్టించుకోలేదని తెలిపింది. నాజం ఆరు నెలల కిందట ఉపాధి నిమిత్తం దుబాయి దేశానికి వలస వెళ్లి 15 రోజుల కిందట స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గణేశ్ తనకు భూమి చేయకపోవడంపై తన భర్త నాజం మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు జ్యోతి తెలిపింది. వారం రోజులుగా సిరిసిల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 24న మృతిచెందినట్లు తెలిపింది. తన భర్త చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. లేని పక్షంలో తమ కుటుంబంతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

ఎన్టీపీసీలో ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య

జ్యోతినగర్, జనవరి 25: ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందిన రమేష్(36) అనే ఔట్‌డోర్ ఫొటోగ్రాఫర్ బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. 10 సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్న రమేష్ రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెదిన రమేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎన్టీపీసీ ఎస్ఐ జీవన్ పరిశీలించారు. మృతుడి తల్లి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జీవన్ తెలిపారు.

ముస్లింల విద్యా ప్రమాణాల మెరుగుకు ఎంఐఎం కృషి

కరీంనగర్ టౌన్, జనవరి 25: ముస్లింల విద్యాప్రమాణాలు మెరుగుకు ఎంఐఎం కృషిచేస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సాలారే మిల్లత్ ఆల్‌ఇన్‌వన్ గైడ్స్ పంపిణీ కార్యక్రమం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ కృషితోనే మైనారిటీ గురుకులాల అంకురార్పన జరిగిందన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా 2,024 గైడ్స్ అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జిహెచ్‌ఎంసి నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర నాయకుడు మహ్మద్ ఖైరుద్దీన్, సదర్ ఖాజీ మొఖయ్యర్ షాఖాన్, మైలానా అబుల్ కలాం మిస్బాహి, ముఫ్తి యూసుఫ్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, నగర ప్రధానకార్యదర్శి బర్కత్ అలీ, హఫీజ్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖమరుద్దీన్ తదితరులున్నారు.

పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జడ్పీ చైర్మన్



ప్రభుత్వ ఆస్పత్రిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జడ్పీ చైర్మన్

పెద్దపల్లిటౌన్, జనవరి 25: జిల్లా ప్రభుత్వఆసుపత్రిని గురువారం జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు, ఇతర సదుపాయాలను జడ్పీ చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. మందులు, ఆహారం అందుబాటులోనే ఉన్నాయా అని ఆరాతీశారు. దవాఖానాలో రోగులు, అటెండెంట్లకు అందిస్తున్న ఆహారంపై ఆసుపత్రి సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడినందున ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితులను తెలుసుకోవడానికి సందర్శించినట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాతాశిశు ఆసుపత్రులను గొప్పగా తీర్చిదిద్దామని, వాటివలన పేదలకు వైద్యం అంది లబ్ధి చేకూరిందన్నారు. ఆసుపత్రిలో వైద్యులు సరిపడే సంఖ్యలో ఉన్న సిబ్బంది కొరత ఉందని, కొంతమేర మందుల కొరత ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. నూతనంగా ఏర్పడ్డ ప్రభుత్వం దృష్టికి ఆసుపత్రి సమస్యలను తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ రమాకాంత్ సిబ్బంది, తదితరులున్నారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

మంథని, జనవరి 25: స్థానిక శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షురాలు మహావాది జలజ తెలిపారు. ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పొత్కపల్లి హైస్కూల్లో మాక్ పోలింగ్

ఓదెల, జనవరి 25 : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పొత్కపల్లి పాఠశాలలో గురువారం విద్యార్థులకు మాకు పోలింగ్ నిర్వహించారు. ఎంపీడీవో సత్తయ్య, హెచ్ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భద్రయ్య, సులోచన,రమేష్, అమృత కిషోర్,జైపాల్ రెడ్డి, రఘుపతి,పద్మావతి దేవి,సంజీవ్, దీప, రవీందర్,రామకృష్ణ పాల్గొన్నారు.

నూతన నియామకం

ధర్మారం,జనవరి25: మాల మహానాడు ఆఫ్ ఇండియా యువజన విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ధర్మారం మండల కేంద్రానికి చెందిన మగ్గిడి దీపక్ నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి ప్రకటించారు. గురువారం దీపక్ నియామక పత్రంను అందుకున్నారు.

రాజీవ్ రహదారిపై లోకల్ లారీ ఓనర్ల రాస్తారోకో

అంతర్గాం, జనవరి 25: మండల పరిధిలోని కుందనపల్లి శివారులో గల ఎన్టీపీసీ యాష్‌పాండ్‌లో లోకల్ లారీ అసోసియేషన్ నాయకులు గురువారం బుగ్గ గుట్ట టర్నింగ్ వద్ద రాజీవ్‌రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బూడిద రవాణా కోసం కాంట్రాకర్లు వేరే ప్రాంతాల నుంచి లారీలను తీసుకురాగా తమకు ఉపాధి దొరకం లేదంటూ స్థానిక లారీ ఓనర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి తమకు పాధి కల్పన జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రాస్తారోకోలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొని లారీ ఓనర్ల నిరసనలకు మద్దతు తెలిపారు. ఎంపీపీ దుర్గం విజయ, మాజీ ఎంపీటీసీలు ఆడెపు రాజేశం, ఉరిమెట్ల రాజలింగం, నాయకులు పెండ్యాల మహేష్, మద్దీ తిరుపతిగౌడ్, ఓనర్స్ అసోసియేషన్ నాయకులు సంపంగి శ్రీనివాస్, శివరాత్రి గంగాధర్, సుమన్ పాల్గొన్నారు. కాగా భూ నిర్వాసితులమైన తమకు బూడిద రవాణా పనులను అప్పగించాలని కుందనపల్లి గ్రామస్తులు యాష్‌పాండ్‌ను సందర్శించి నిరసన తెలిపారు. నిత్యం కాలుష్యం మధ్య జీవిస్తున్న తమకు బూడిద తరలింపునకు అవకాశం కల్పించాలని కుందనపల్లి వాసులు ఎన్టీపీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బుర్ర కావ్య, నాయకులు ఇష్తాకర్, షబ్బీర్, మైసయ్య, శేఖర్, వెంకటేష్, లక్ష్మి పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు

కళ్యాణ్‌నగర్, జనవరి 25: ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 10న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ముత్యంరావు, ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మద్దెల శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాములు, టీఎస్‌టీయూసీ నాయకులు సంగెపు రాజు పిలుపునిచ్చారు. గురువారం గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు, కార్మికులు, రైతులు, ప్రజలపై మోయలేని భారాలు పడుతున్నాయని, ఈ సమ్మెలో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, కేశోరాంతో పాటు అసంఘటిత, సంఘటిత కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. సమ్మె విజయవంతం కోసం ఫిబ్రవరి 4న జిల్లా కేంద్రంలో సదస్సును నిర్వహించనున్నట్లు, ఈ సదస్సుకు అధిక సంఖ్యలో కార్మికవర్గం తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వేల్పుల కుమారస్వామి, అశోక్, దామోదర్‌రెడ్డి, రత్నకుమార్, శనిగరపు చంద్రశేఖర్, కరీం తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు - కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థులకు టీ షర్ట్స్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

పెద్దపల్లి రూరల్, జనవరి 25 : విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో 2006-07 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో టీషర్ట్‌లను విద్యార్థులకు కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మనిషికి విద్య చాలా అవసరమన్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న గొప్ప వ్యక్తులంతా ఒకానొక సమయంలో పేదరికంలో ఉన్న వారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని, ప్రస్తుతం జీవితంలో గొప్ప స్థాయికి చేరుకున్నారని, వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు అవసరమైన సహాయ,సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అనంతరం 2006-07 బ్యాచ్ పూర్వవిద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇటీవల గణితం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాఠశాలలో చదువుతున్న డి.శృతి ప్రథమ స్థానంలో నిలువగా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీపీవో చంద్రమౌళి, మండల విద్యాశాఖ అధికారి సురేందర్, సర్పంచ్ స్వరూప-పోచాలు, ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం, ఇన్‌చార్జీ రామేశ్వర్, పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



మంథనిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు.



ముత్తారంలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి

మంథని, జనవరి 25: ప్రజలంతా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నపుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యపడుతుందని మంథని ఆర్డీవో హనుమా నాయక్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వివిధ కళాశాలల విద్యార్థులు, ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల ఉద్యోగులతో కలిసి పట్టణ పురవీధుల్లో అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కొత్త ఓటర్లకు కార్డులు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో డీఏవో తూము రవీందర్, తహశీల్దార్ రాజయ్య, డీటీలు సిరిపురం గిరి, సంగ్రామ్‌సింగ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, జనవరి 25 : ఓటు వేసే ప్రతి ఒక్కరూ ఓటు ప్రాముఖ్యతను తెలుసుకోని ప్రజా స్వామ్య విజయానికి తోడ్పడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. లక్ష్మీ నర్సయ్య అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్జున్, మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఓటు ప్రాముఖ్యతను తెలుసుకోని ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు నితిన్, రవిందర్‌రావు, రామకృష్ణ, శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ధర్మారం, జనవరి 25: మండలంలో జాతీయ ఓటర్ల దినోత్సవంను నిర్వహించారు. పాఠశాలల ఆవరణలో విద్యార్థులు, యువకులు ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. ఓటు హక్కుపై, ప్రజాస్వామ్య వ్యవస్థపై ఎంపీడీవో జయశీల వివరించారు. బీఎల్‌వోలు, అధికారులు పాల్గొన్నారు.

ముత్తారం జనవరి 25: మండల కేంద్రంలో తహసీల్దార్ బండి రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. పోతారం పాఠశాల పోలింగ్ బూత్ అంగన్వాడీ టీచర్ శోభరాణి ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ నెత్తెట్ల మహేందర్, పంచాయతీ కార్యదర్శి జీవన్‌ప్రసాద్, ప్రాథమికపాఠశాల ప్రాధనోపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయుడు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవం గురువారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం జరిగింది. విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమాకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర)లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాధవి, ఎన్ఎస్ఎస్ పీవో జీడీ కనకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్యోతినగర్, జనవరి 25 : జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఎన్టీపీసీలో గురువారం నిర్వహించారు. టీటీఎస్ జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్లను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, సీడీపీవో స్వరూపారాణి, మెప్మా రజని, తహసీల్దార్ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జనవరి 25 : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను, నూతనంగా 18 సంవత్సరాలు నిండి కొత్తగా ఓటరు నమోదు చేసుకున్న వారిని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సన్మానం చేసి, ఓటరు కార్డు అందజేశారు. ఓటరు ప్రతిజ్ఞను అందరితో చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

రామగిరి, జనవరి 25: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జేఎన్టీయూ(మంథని) కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. జీఎం కార్యాలయం సమీపంలో మానవహారం చేపట్టి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దుర్గారావు, అధికారులు శ్రీనివాసులు, రాంనరేష్, డిఇఇ సతీష్, రవీకుమార్, రమణ, డిప్యూటి తహసీల్దార్ రాకేష్, పిడి పింగిళి కృష్ణరెడ్డి, ఎన్ఎస్ఎస్ సదానందం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జనవరి 25: మండలంలోని కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నూతన ఓటర్లను సన్మానించి ఓటరు కార్డులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. తహసీల్దార్ జాహెద్‌పాషా, ఎంఈవో రాజయ్య, డిప్యూటీ తహసీల్దార్ ధీరజ్, ఆర్ఐలు ఉదయశ్రీ, నరసింగం, ప్రధానోపాధ్యాయులు సునీత బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎలిగేడు, జనవరి 25 : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవంను నిర్వహించి పలువురు సీనియర్ సిటిజన్లు ఓటర్లను సత్కరించారు. తహసీల్దార్ స్వర్ణ, హెచ్ఎం గండ్ర దేవేందర్ రావు, జడల సత్యనారాయణ, ఆర్ఐ శైలజ, జీపీ కార్యదర్శి సౌమ్య, అంగన్వాడీ టీచర్లు, సీఆర్పీ సత్యనారాయణ, ఐఆర్పీ సంతోష్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న జేఎన్టీయూ విద్యార్థులు

కమాన్‌పూర్, జనవరి 25 : మండలంలోని జూలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్పంచ్ బొల్లపల్లి శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు ఓటరు డేపై ప్రతిజ్ఞ చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకట రమణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కారోబార్ భూమయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్గాం, జనవరి 25: మండల పరిధిలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. తహసిల్దార్ పీ రాంమోహన్, ఎంపీడీఓ యాదగిరిలు మండలంలోని ముర్మూర్ గ్రామంలో యూపీఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఆర్ఐలు రాజేందర్‌రెడ్డి, శ్రీధర్, బీఎల్‌ఓలు, పెండ్యాల విమల, భారతి, సర్పంచ్ స్వామి పాల్గొన్నారు.

జూలపల్లి, జనవరి 25 : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించి, ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నా తహశీల్దార్ బషీరుద్దీన్ మాట్లాడుతూ ఓటుహక్కు దాని ప్రాముఖ్యతపై ఓటర్లకు వివరించారు. ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ నర్సింహాయాదవ్, ఉపసర్పంచ్ కొప్పుల మహేష్, పలువురు పాల్గొన్నారు.



ఖని పీజీ కళాశాలలో విద్యార్థుల ప్రతిజ్ఞ



సీనియర్ ఓటర్లు, ట్రాన్స్‌జెండర్లను సన్మానిస్తున్న అధికారులు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

పెద్దపల్లి రూరల్, జనవరి 25 : మండలంలోని నిమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఎలైట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎలైట్ అధ్యక్షులు భిక్షపతి, కార్యదర్శి పిట్ట వెంకటేష్, కోశాధికారి అతీఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

పెద్దపల్లి రూరల్, జనవరి 25 : మండలంలోని తుర్కలమద్దికుంట జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ విజన్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య సహాయకులు అబ్దుల్ వాసే 24మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేసుకొని కంటి చూపు తగ్గకుండా జాగ్రత్త పడాలని క్లబ్ వ్యవస్థాపకులు లయన్ పూదరి దత్తాగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తాజుద్దీన్, సంజీవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

సుల్తానాబాద్, జనవరి25: సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పలువురు దాతలు అందించిన సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా భక్త బృందం మహిళా గ్రూప్ సభ్యులు పావని, నీరజ, లత, ప్రమోదిని, రాజేశ్వరి, లక్ష్మి, నగునూరి అశోక్ కుమార్, జూలూరి అశోక్, అయితే రమేష్, చేకిలం మారుతి, కొమురవెల్లి భాస్కర్, ఏనుగు నరేందర్‌రెడ్డి, పిట్టల వెంకటేశం, సిరిపురం రమేష్, పెగడ చందు, చకిలం అజయ్, తుమ్మ రాజ్ కుమార్, బొమ్మిదేని రాజేష్ తోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు మహిళలు పలువురు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

సుల్తానాబాద్, జనవరి 25: టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా సుల్తానాబాద్ పెరిగిద్ద అంజనేయస్వామి దేవాలయంలో వైభవంగా నూట అరవై జంటలకు శ్రీసత్యనారాయణస్వామి సామూహికవ్రతాలు నిర్వహించారు. పూజా అనంతరం తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మెంగని చంద్రశేఖర్, సత్యనారాయణ రామిరెడ్డి, కృష్ణమూర్తి, వీరన్న, ఎంపీపీ బాలాజిరావు-స్వరూప, వెంకటేశ్వర్లు, లక్ష్మి, నారాయణ్‌రావు, సుభాషిణి, నారాయణ, శారద తదితరులు నిర్వహించారు.

సుందరకాండ పారాయణం

మంథని, జనవరి 25: లోక కల్యాణార్థమై సుందరకాండ పారాయణం నిర్వహిస్తున్నట్లు భలవీర హనుమాన్ దేవాలయ కమిటీ నాయకులు ఓదెలు, శ్రీనివాస్, రాజయ్య, మోహన్, సతీష్ లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంథని మున్సిపల్ పరిధి బోయిన్ పేట(గొల్ల గూడెం)లోగల భలవీర హనుమాన్ దేవాలయంలో వచ్చే నెల 2వ తేదీ నుండి 4వ తేదీ వరకు గణపతి పూజ, మాతృక అఖండ దీపారాధన, సుందరకాండ పారాయణం, హవనం కార్యక్రమాలు మంథని వేద బ్రాహ్మణ పండితులు, బ్రహ్మశ్రీ నల్లగొండ మదనగోపాల్ శర్మ, బ్రహ్మశ్రీ దుద్దిళ్ళ మారుతి శర్మలచే నిర్వహించడం జరుగుతుందన్నారు. దైవ కార్యక్రమంలో దాతలు ఎవరైనా సహాయం చేయాలనుకుంటే సెల్ నెం. 9177861543, 9553801511లను సంప్రదించాలని కోరారు.

రైతులకు అవగాహన సదస్సు



రైతులతో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

ముత్తారం, జనవరి 25: మండల కేంద్రంలోని రైతు వేదికలో మిర్చి పంట ప్రాసెసింగ్‌పై రైతులకు గురువారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజి ఎంటర్‌ప్రైన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రతినిధి జీవదొరైస్వామి, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, సెరికల్చర్, ఆర్టికల్చర్ అధికారి జగన్మోహన్ రెడ్డి, నాబార్డ్ డీడీఎం జయప్రకాష్, డిఆర్‌డిఒ శ్రీధర్, ఏవో శ్రీకాంత్, హెచ్‌ఓ శ్రీకాంత్, ఏఈవోలు, డిపిఎం, ఏపీఎం, వెలుగు రేఖ గ్రామీణ అభివృద్ధి సంస్థ సీఈవో రజిత, ముత్తారం ఎఫ్.పి.ఓ సీఈఓ శ్రీనివాస్, ఎస్‌హెచ్ జి మహిళలు, రైతులు పాల్గొన్నారు.

కల్వచర్లలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

రామగిరి, జనవరి 25: మండలంలోని కల్వచర్ల గ్రామంలో గురువారం బేగంపేట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పద్మపాణి స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్థానిక సర్పంచ్ గంటపద్మ అధ్యక్షతన గ్రామస్థులకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. 50 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. హెచ్ఐవి, షుగర్, టీబీకి సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్. హెచ్.పి ధీరజ, ఏఎన్ఎంలు తార, తిరుమల, విజయ, స్వప్న, ఉప సర్పంచ్ వెము కనకయ్య, మాజీ జడ్పీటీసీ గంటవెంకటరమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

'జీవో నంబర్ 55ను వెనక్కి తీసుకోవాలి'

సుల్తానాబాద్, జనవరి 25 : జీవో నంబర్ 55ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ విభాగ్ హస్టల్ కన్వీనర్ రాసూరి ప్రవీన్ డిమాండ్ చేశారు. గురువారం సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్ మాట్లాడుతూ వ్యవసాయ ఉద్యానవర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దని నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు దాడి చేయడం దుర్మార్గమని వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేల్పుల నాగచంద్ర, సుల్తానాబాద్ నగర కార్యదర్శి అమరగొని శ్రీనివాస్, నాయకులు వినయ్, అఖిల్, సాయి కిరణ్, నిశాంత్ పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ఎలిగేడు, జనవరి 25: మండలంలోని శ్రీవెంకటేశ్వర దేవస్థానం ప్రాంగణంలో టీటీడీ దేవస్థాన ప్రచార కర్తలైన రమ, రాంమోహన్‌రావుల ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు కన్నుల పండువగా జరిగాయి. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నప్రసాదం గైకొని ఆదేవుని కృపకు పాత్రులు అయ్యారు.

ఎల్లమ్మ కొలుపు కోసం సన్నాహక సమావేశం

కమాన్‌పూర్, జనవరి 25 : మండల కేంద్ర పరిధిలోని పిల్లి పల్లెలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కొలుపు కోసం గౌడ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఎల్లమ్మకొలుపు వేడుక కోసం సన్నాహక సమావేశం జరిగింది. ఎల్లమ్మ కొలుపు కోసం నిర్వహించే తేదీపై చర్చించారు.ఈ సమావేశంలో మల్యాల రామచంద్రగౌడ్, నగునూరి నరసయ్యమెడగొని రాజయ్య, రంగు శ్రీను, మల్యాల సతీష్, మల్యాల మహేష్, రంగు సత్యం మెడగొని విజయ్, గారేపల్లి వెంకన్న, వెంగల్ తిరుపతి, రాజయ్య, రవి, చలమయ్య ఉన్నారు.

ఓటరు దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన

సుల్తానాబాద్, జనవరి 25: ఓటుతో బలోపేతమైన సమాజాన్ని రూపొందించగలమని ఇండియన్ పబ్లిక్ పాఠశాల డైరెక్టర్ సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులకు ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు.



గణతంత్ర వేడుకలను విజయవంతం చేయండి

- ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు

రామగిరి, జనవరి 25: సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్లలో నిర్వహించే గణతంత్ర వేడుకలను విజయవంతం చేయాలని జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో ఉదయం 10గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ, ఎస్‌అండ్‌పీసీ, విద్యార్థులచే పరేడ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉద్యోగులకు సత్కారం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఆర్జీ-2 ఉత్తమకార్మికులు వీరే..

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25: ఆర్జీ-2 డివిజన్‌కు చెందిన ఉత్తమ కార్మికుల వివరాలను గురువారం యాజమాన్యం ప్రకటించింది. ఉత్తమ సింగరేణియన్‌గా రజాఅలీ (ఈపీ ఎలక్ట్రిషియన్, ఓసీపీ-3) ఎంపిక కాగా, ఉత్తమ అధికారిగా ఓసీపీ-3 అడిషనల్ మేనేజర్ ఆర్ రమేష్ ఎంపికయ్యారు. వీరిని కొత్తగూడెంలో జరిగే ప్రధాన గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎండీ ఎన్ బలరాం సన్మానించనున్నారు. ఆర్జీ-2 ఉత్తమ సూపర్ వైజర్‌గా పోశాల సంపత్ కుమార్(ఫోర్‌మెన్, ఏరియా వర్క్‌షాప్)ఎంపికయ్యారు. ఉత్తమ కార్మికులుగా దొంగరి శ్రీనివాస్(ఓవర్‌మెన్, ఓసీపీ-3), మంద బానేష్(డ్రిల్ ఆపరేటర్, ఓసీపీ-3), గుండపు నారాయణ(సపోర్ట్‌మెన్, వీకేపీ గని), కర్రె సాగర్(జనరల్ మజ్దూర్, వీకేపీ గని), గుడెపు శంకర్(టిండాల్, సీహెచ్‌పీ)లను యాజమాన్యం ఎంపిక చేసింది. వీరిని ఆర్జీ-2 ఏరియాలో జరిగే గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జీఎం సన్మానించనున్నారు.

వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నాం : ఆర్జీ-2 జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25: సెక్యూరిటీ విభాగం సిబ్బంది వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ తెలిపారు. నూతనంగా నిర్మించిన సెక్యూరిటీ విభాగం డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ను గురువారం జీఎం ప్రారంభించారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణకు అన్ని వేళల అప్రమత్తతో పనిచేసే ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది కోసం 16లక్షల వ్యయంతో డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ఏర్పాటు చేసినట్టు జీఎం పేర్కొన్నారు. ఈడిస్ట్రిబ్యూషన్ పాయింట్ ఏరియాలో వివిధ పోస్టుల లో విధులు నిర్వహించే సిబ్బంది మస్టర్ బుకింగ్ పాయింట్, మంచి నీటి సదుపాయం, మరుగుదొడ్లు, వంటి వసతులు ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది సమర్థవంతమైన పనితీరుతోనే కంపెనీకి రక్షణ అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఎస్వోటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, అధికారులు ధనుంజయ, మురళీకృష్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ నర్సయ్య పాల్గొన్నారు.

వీటీసీలో అదనపు గదుల ప్రారంభించిన జీఎం

ఆర్జీ-2 ఏరియా ఎంవీటీసీలో నూతనంగా నిర్మించిన అదనపు గదులను గురువారం జీఎం సూర్యనారాయణ ప్రారంభించారు. సింగరేణి పర్మినెంట్ ఉద్యోగులకు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, నూతనంగా ఉద్యోగాల్లో చేరే యువ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమని భావించి వీటీసీలో అదనపు గదులను నిర్మించినట్టు జీఎం పేర్కొన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్,ఎస్వోటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, అంఫ్జీ డీజీఎం హసెన్ని, మేనేజర్ రంగారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ప్రకాష్, అన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన కార్మికుడిని పరామర్శించిన సీఎండీ



బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న సీఎండీ బలరాంనాయక్

గోదావరిఖని, జనవరి 25: జీడీకే 2ఏ ఇంక్లైన్‌లో గని ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మైనింగ్ సర్దార్ సమ్మిరెడ్డిని గురువారం రాత్రి సింగరేణి సీఎండీ బలరాంనాయక్ పరామర్శించారు. ఐసీయూలో ఉన్న సమ్మిరెడ్డి వద్దకు వెళ్లి త్వరలోనే కోలుకుంటావని భరోసా ఇచ్చారు. అనంతరం వైద్యుల బృందంతో మాట్లాడారు. యశోదా ఆసుపత్రి ఎండీ జీఎస్‌రావుతో ఫోన్‌లో మాట్లాడిన సీఎండీ సమ్మిరెడ్డికి మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. అనంతరం సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, సింగరేణి ఖర్చుకు వెనుకాడకుండా మెరుగైన వైద్యం అందిస్తుంద న్నారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. సమ్మిరెడ్డికి అందు తున్న వైద్య సేవలను తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని డిప్యూటీ సీఎంవో బాలకోటయ్యను ఆదేశించారు. విపత్కర పరిస్థితుల్లో అండగా నిలిచిన యాజమాన్యానికి సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. యశోద ఆసుపత్రి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గోపీకృష్ణ, డాక్టర్ బాలకోటయ్యలు సీఎండీ వెంట ఉన్నారు.